# మా నాన్నగారి ఊరు

— జింబో.


టీవీలో క్రికెట్ చూస్తున్నానన్న మాటేగానీ మన స్సంతా ఆఫీసులో రామారావు అన్న మాటల మీదే వుంది. ఎంత అలవోకగా అనేశాడు. తలచుకుంటేనే మనసు భగ్గున మండుతుంది. 'ఆ సాయేబుకి పాకిస్తానే గెలవాలని వుంటుంది' నవ్వుతూ నవ్వుతూనే అన్నాడు. అతని మాటలు పల్లేరుగాయల్లా గుచ్చుకొంటున్నాయి.

తొమ్మిదిన్నర దాటింది. ఆఫీసుకెళ్లడానికింకా గంటన్నర టైముంది. టీవీ ముందు కూర్చున్నానన్న మాటేగానీ మనస్సంతా పరిపరివిధాలా పోతూంది. కాలింగ్ బెల్ మోగడంతో ఈ లోకంలోకి వచ్చాను. లేచి తలుపు తీశాను. టెలిగ్రాంతో పోస్ట్‌మాన్. సంతకం పెట్టి టెలిగ్రాం తీసుకున్నాను.

'ఐదు గంటలకి ఫుప్పూ చనిపోయింది' – రెహమాన్ ఫుప్పూ (మేనత్త)కి డెబ్బై అయిదేళ్ళు దాటి వుంటాయి. రెండు మూడు నెలలుగా ఫుప్పూ ఆరోగ్యం బాగాలేదన్న విషయం తెలిసిందే. బతికివుండగా ఓసారి చూసిరావాలనుకుంటూనే చూడలేకపోయాను. అందుకు నా మీద నాకే కోపం వచ్చింది. మా పప్పా (నాన్నగారి) తాలూకు చివరి మనిషి ఫుప్పూ. నాన్నగారు చనిపోయి ఎనిమిది సంవత్సరాలైంది. తాయా (పెద్దనాన్న) చనిపోయి ఆరేళ్ళైంది. ఫుప్పూ చివరిది. వాళ్ళ తల్లిదండ్రులు నా చిన్నప్పుడే చనిపోయారు. అత్తయ్యకి పిల్లలు లేరు. ఆమె భర్త ఎప్పుడో చనిపోయాడు. రెహమానే ఆమె బాధ్యత స్వీకరించాడు. రెహమాన్ మా తాయా పెద్దకొడుకు.

మా పప్పా ఊరికి నాకు బుద్ధి తెలిసినప్పటి నుంచి మూడు నాలుగుసార్లు వెళ్ళి వుంటానేమో. ఆరేళ్ళ క్రితం తాయా చనిపోయినపుడు వెళ్ళాను. మళ్ళీ ఇపుడు. పెళ్ళిళ్ళకీ, చావులకీ తప్ప మామూలుగా మా పప్పా ఊరు వెళ్ళలేదు. వాటిక్కూడా ఓసారి 'బడే భాయీ', మరోసారి 'ఛోటే భాయీ', ఒక్కోసారి నేను. సెలవుల్లో రమ్మని 'తాయాజాన్' ఎన్నోసార్లు ఉత్తరాలు రాశారు. కానీ ఎందుకో వెళ్ళనే లేదు.

మా పప్పా తన ఇరవైరెండో ఏట ఇంట్లో గొడవపడి మా ఊరొచ్చి స్థిరపడ్డాడు. తను చదివిన వైద్య వృత్తిని చేపట్టాడు. మా నాన్నే మా ఊరి ప్రాంతంలోని తొలి డాక్టర్. మా ఊరి దగ్గర్లోని పల్లెటూరులోని మా 'అమ్మి'ని పెళ్ళి





# మంచి తరుణం

తలచుకుంటే మనస్సు కందిపోతుంది.
పేరెత్తితే నోరు పొక్కిపోతుంది.
కళ్ళెత్తి చూస్తే రెప్పలు కమరిపోతాయి.

అలాంటి నడి వేసవి ఎండలో, ఉసురసురంటూ చలివేంద్రలకు చేరుకుని దప్పిక తీర్చుకుని విశ్రాంతి తీసుకుంటూ బాటసారులు ప్రపాపాలికలతో జరిపే సరస సల్లాపాలు – వీరి కొసర్లూ వారి విసుర్లూ సంస్కృతాంధ్ర కృతుల్లో సహృదయుల సాహిత్య తృష్ణను తీర్చే చలి పందిళ్ళు.

"సో కమపి నగచ్ఛతి యత్
మధ్యాహ్నే పశ్య! శిశిరతలలగ్నా!
ఆతపభయేన ఛాయాపి
తస్మాత్ పధిక! కిం నవిశ్రామ్యసి!!"

ఓయీ! పథిక యువా! ఎండ నిప్పులు చెరుగుతోంది. ఎండకు గుండె జారి చలి పందిరి క్రిందికి చేరుకొన్న నీడ అక్కడి నుంచి కొంచెం కూడా కదలడం లేదు. ఇలాంటి మిటమిటని మధ్యాహ్నం వెళ్ళి పోవాలని లేస్తావేమిటి? కూర్చో, ఇంకా కొంత సేపు విశ్రాంతి తీసుకో.

'వెట్టి వాడా! ఇక్కడ నీవూ నేనే. మరెవ్వరూ లేరు. మంచి తరుణం, మించిన దొరకదు' అని తనలో రేగుతున్న కోర్కెను తెరువరికి సూచిస్తున్నది.

– శనగన నరసింహస్వామి

చేసుకున్నాడు. మా ఊరికీ, మా 'నాన్నగారి' ఊరికీ ఐదు వందల కిలోమీటర్ల దూరం. మా నాన్నే అప్పుడప్పుడూ వెళ్ళివచ్చేవాడు. ఆ వూరితో మాకు సంబంధాలు తక్కువే. మా పప్పా బంధువులు అప్పుడప్పుడూ వచ్చివెళ్తూ వుండేవాళ్ళు. మా అక్కయ్యలు, అన్నయ్యలు, నేనూ అందరమూ మా ఊళ్ళోనే పుట్టి పెరిగాము.

టెలిగ్రాం తీసుకొని లోపలికొచ్చి ఆ విషయం అమ్మీకి చెప్పాను. అమ్మీ దిగాలుపడింది. చావు అని వార్తమైనప్పటికీ అదో భయం. వెళ్దామని చెప్పింది. బ్యాగ్ సర్దేయమని మా ఆవిడకి చెప్పాను. లీవులెటర్ రాసి ఆఫీసులో ఇచ్చి వచ్చాను. పదకొండు గంటలకి హైదరాబాద్ బస్సు వుంది. అక్కడ్నించి ఐదు గంటల ప్రయాణం. మా ఊరికి ఫోన్ చేసి అన్నయ్యలకి ఈ విషయం చెప్పాను. వాళ్ళకి కూడా టెలిగ్రాములు అందాయట. అమ్మని తీసుకొని నన్ను వెళ్ళమని చెప్పారు. వాళ్ళు 'దహూమ్'కి (పది రోజుల్లో చేసే కార్యక్రమం) వెళ్తామని చెప్పారు.

అమ్మీజాన్, నేనూ ఇద్దరమూ మా నాన్నగారి ఊరికి బయల్దేరాము. ఆరు గంటల ప్రాంతంలో మా నాన్నగారి ఊరు చేరాము. ఇల్లు వెతుక్కోవడంలో కష్టమేమీ కాలేదు. గుర్తుంది. మా నాన్నగారి ఇల్లు పాతబడిపోయింది. నిశ్శబ్దంగా వుంది. రెహమాన్ పిల్లలు హైదరాబాద్ నుంచి రానట్టున్నారు. కొంతమంది బంధువులు, రెహమాన్ తోబుట్టువులు ఇంట్లో వున్నారు. అమ్మను చూడగానే గొల్లుమన్నారు. మా కోసం చూసీ చూసీ వుప్పా శవాన్ని అరగంట క్రితమే డోలాలో తీసుకెళ్ళారట. ఓ కుర్రవాణ్ని ఇచ్చి ఖబరిస్తాన్‌కి నన్ను పంపించారు. పరుగు పరుగున అక్కడికి వెళ్ళాను. మసీదులో జనాజ్‌కీ నమాజ్ చేయించి వుప్పా శవాన్ని అప్పుడే అక్కడికి తీసుకొచ్చారు. 'ఆఖరీ దీదార్' చూపించారు. వుప్పా మొహం చివరిసారి చూసాను. తత్ఫీన్ అయిపోయింది. అమ్మ మాత్రం వుప్పా మొహం చూడలేక పోయింది.

మహబూబ్ మామూ మా దగ్గరి బంధువు. నన్ను ఊళ్ళోకి తీసుకువెళ్ళాడు. ఒకరిద్దరు నన్ను పలకరించారు. గుర్తుకురాలేదు. ఒకరిద్దరిని పరిచయం చేశాడు. మా నాన్న, అతను కలసి చదువుకున్నారట. వాళ్ళు కలిసి చదువుకున్న స్కూలు, ఆటలాడిన స్థలాలు, ఈతలు కొట్టిన వాగూ అన్నీ చూపించాడు మామూ. అన్నీ అపరిచితంగానే వున్నాయి. నాన్నగారి జ్ఞాపకాలు చెప్పాడు. శ్రద్ధగా విన్నాను. ఇంటికి వచ్చాం. మా నాన్న చదువుకునే గదినీ, ఆయన ఎప్పుడూ కూర్చునే పాత కుర్చీని అన్నీ మహబూబ్ మామూ చూపించాడు.

తెల్లవారింది భారంగా. బయల్దేరాలి తిరిగి. సెలవులు లేవు. మధ్యాహ్నం రెండు గంటలకి బస్సు వుంది. ఆ బస్సుకి వెళ్తామని రెహమాన్‌కి చెప్పాను. ఆ రోజు వుండిపొమ్మని రెహమాన్ భాబీజాన్ బలవంతం చేశారు. ఆఫీసులో పనులున్నాయని చెప్పాను. వుప్పా, లూయీ, పప్పాల ఫొటోలు ఆల్బమ్ నుంచి తీసుకున్నాను. 'మళ్ళీ ఎప్పుడొస్తావో మువ్వ' అన్నాడు రెహమాన్. దిగులుగా అనిపించింది.

భోజనాలు చేసి రెండు గంటల బస్సుకి అమ్మ, నేను బయల్దేరాం. మా నాన్నగారు చదువుకున్న స్కూలునీ, ఆడుకున్న మైదానాలనీ, ఆయన బాల్యంతో పెనవేసుకున్న ఇంటినీ, ఊరినీ దాటుకుంటూ బస్సు బయల్దేరింది. రెహమాన్ అన్నట్టు మళ్ళీ ఎప్పుడు చూస్తానో మా నాన్నగారి ఊరు.

ఏడు గంటలకి హైదరాబాద్ చేరాం. ఆ రాత్రి మా ఛోటీ బహెన్ ఇంటికి వెళ్ళాం. ఉదయాన అమ్మీజాన్ కోరిక మీద మా ఊరు బయలుదేరాం. పది గంటల ప్రాంతంలో బస్సు మా ఊరి పొలిమేరలకు వచ్చింది. అక్కడి గాలి పీలుస్తూనే ఏదో ఆనందం. ఎన్నో జ్ఞాపకాలు. పొలాలని చూస్తూనే అక్కడ ఆడుకున్న జ్ఞాపకాలు. మక్క కంకులు కాల్చుకున్న రోజులు... అన్నీ గుర్తుకొచ్చాయి. అమ్మని రిక్షాలో ఇంటికి పంపించి నడుస్తూ ఊళ్ళోకి బయల్దేరాను. వాగు దాటి వెళ్తుంటే అక్కడ ఎగిరి గంతులేసిన రోజులు, ఈతలుకొట్టిన రోజులు అన్నీ గుర్తుకొచ్చాయి. మెడికల్ షాపు దగ్గర చంద్రమౌళితో సంభాషణ, ఫోటో స్టూడియోలో రవీంద్రతో అభిభాషణ ముగించి దారి వెంట మిత్రుల ఆత్మీయుల పలకరింపులకి జవాబులిస్తూ ఇంటికి దారితీశాను. భీమన్న గుడి దగ్గర మా పాతబడి. జ్ఞాపకాలతో మనసు కొట్టుకుంది.

ఇంటికి వచ్చాను. కచేరీలో నాన్నగారి ఫోటో. ఆయన ఎప్పుడూ కూర్చుండే కుర్చీ. ఎడమ ప్రక్కన ఆయన ఎప్పుడూ పేషంట్లని చూసే రూమునీ చూస్తే ఇంకా ఆయన వున్నట్టే అనిపించింది. బావి దగ్గరికి వెళ్ళి కాళ్ళు కడుక్కున్నాను. మా నాన్నగారు అక్కడ స్నానం చేసేవారు. మాకు చేయించేవారు. జ్ఞాపకాలతో తడిసి ముద్దైపోయాను.

మా ఊరికీ, మా నాన్నగారి ఊరుకీ ఎంత భేదం? అపరిచితానికీ, ఆత్మీయతకీ వున్నంత తేడా. నేను రాగానే మా ఊరు నన్ను కౌగిలించుకుంది. ఆత్మీయంగా ఒళ్ళంతా తడిమింది. ఆప్యాయంగా నిమిరింది. మా నాన్నగారి ఊరూ, ఇల్లూ చూసినపుడు ఎలాంటి స్పందనా లేదు. పరాయిగా అనిపించింది. అలాంటి నాకు, మా నాన్నగారే, మా తాతగారే చూడని దేశం మీద ఏం ప్రేమ వుంటుంది? ఇదే మాట రామారావుని అడగాలనుకున్నాను. ○